సివిల్ అసిస్టెంట్ సర్జన్ మెరిట్‌లిస్ట్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) మెరిట్ జాబితాను శుక్రవారం మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. మొత్తం 442 పోస్టులకు వైద్యారోగ్య శాఖ నోటిఫికేషన్ విడుదల చేయగా, రాష్ట్రవ్యాప్తంగా 4,850 మంది దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను స్వీకరించనున్నట్టు బోర్డు తెలిపింది.

ర్యాంకర్ ఎస్సై పదోన్నతి శిక్షణకు పంపండి

డీజీపీకి పోలీసు అధికారుల సంఘం వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : అవకాశం ఉన్న ఏఎస్సైలను ర్యాంకర్ ఎస్సై పదోన్నతి శిక్షణకు పంపాలని డీజీపీ జితేందర్‌కు పోలీసు అధికారుల సంఘం విన్నవించింది. ఈ మేరకు శుక్రవారం డీజీపీకి వినతిపత్రం అందజేసింది. రాష్ట్రంలో ఉన్న ఖాళీల ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని కోరింది. ర్యాంకర్ ఎస్సై కోటా పెంపుదల గురించి డీజీపీకి విన్నవించినట్టు ఆ సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి తెలిపారు. స్పందించిన డీజీపీ ఎస్సై ర్యాంకర్ పదోన్నతులు ఇచ్చేముందు శిక్షణకు పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, త్వరలో ట్రైనింగ్‌కు పంపుతామని హామీ ఇచ్చినట్టు చెప్పారు.

సర్వే అకాడమీలో శిక్షణకు దరఖాస్తులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబరు 6 (నమస్తే తెలంగాణ) : సర్వే అకాడమీ ఆఫ్ తెలంగాణలో శిక్షణకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ సర్వే ట్రైనింగ్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు 8 వారాల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు ఈ నెల 19 వరకు అన్ని పని దినాల్లో అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌టీఏ పేరున 100 రూపాయల డీడీ తీసి పొందవచ్చని తెలిపారు. ఈ నెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 4,500, ఇతర అభ్యర్థుల కు 10 వేల కనీస ఫీజుతో శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. వివరాలకు 8878801888, 9700566775 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సత్యవేడు ఎమ్మెల్యేపై కేసు

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలు వరలక్ష్మి ఫిర్యాదు మేరకు ఆదిమూలంపై కేసు నమోదు చేసినట్టు తిరుపతి ఈస్ట్ పోలీసులు తెలిపారు. లైంగిక ఆరోపణలపై ఎమ్మెల్యే కోనేటి స్పందించారు. తాను ఏ తప్పు చేయలేదని, రాజకీయంగా ఎదుర్కోలేకనే మహిళా నాయకురాలిని అడ్డం పెట్టుకుని నింద వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీశైలం మల్లన్నకు కానుకగా 108 బంగారు పూలు

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఏపీలోని శ్రీశైలం మల్లికార్జునస్వామిని కర్నూలు జిల్లాకు చెందిన బీసీ శివకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయప్రాంగణంలో 19 గ్రాముల108 బంగారు పూలను వేదపండితుడు గంటి రాధాకృష్ణ, పర్యవేక్షకుడు అయ్యన్నకు అందజేశారు.

మంత్రి సీతక్కకు ఆగంతకుడి ఫోన్‌కాల్

- పోలీసులకు ఫిర్యాదు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 6: రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్కను గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌లో దుర్భాషలాడాడు. ప్రజాభవన్‌లోని క్యాంపు కార్యాలయంలో ఉన్న మంత్రి సీతక్క మొబైల్‌కు శుక్రవారం ఉదయం కాల్ చేసిన ఆగంతకుడు అసభ్యకరంగా మాట్లాడాడు. సుమారు మూడుసార్లు ఫోన్ చేశాడని, దీంతో మంత్రి డ్రైవర్ ఎం. శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మత్స్యకారుల ఆందోళన

ఆత్మకూరు, సెప్టెంబర్ 6: వనపర్తి జిల్లాలోని రామన్‌పాడు రిజర్వాయర్ గేట్లన్నీ ఒకేసారి తెరవడంతో చేపల కోసం వేసిన వలలు కొట్టుకుపోయాయని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ప్రాజెక్టు ఒక గేటు ద్వారా దిగువకు నీటిని వదలగా.. కొందరు మత్స్య వ్యాపారుల లబ్ధికోసం అర్ధరాత్రి ఆ గేటునూ మూసేశారు. శుక్రవారం ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో అధికారులు పది గేట్లు తెరిచి నీటిని విడుదల చేశారు. దాదాపు 3 టన్నుల చేపల వలలు కొట్టుకుపోయి 70మంది నష్టపోయారు. దీంతో మత్స్యకారులు ప్రాజెక్టు రాకపోకలను అడ్డుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకొని మత్స్యకారులకు నచ్చజెప్పారు. అనంతరం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అలీ చెరువుపై హైడ్రామా

- ఆక్రమణలపై గతంలోనే పోలీసులకు నీటిపారుదలశాఖ ఫిర్యాదు
- ఎన్ఆర్ డెవలపర్స్‌కు చెందిన ముప్పాళ్ల వెంకటనర్సయ్యపై కేసు
- ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోని అధికార యంత్రాంగం
- కూల్చివేతలపై రెవెన్యూ, నీటిపారుదల, పోలీస్‌శాఖల బంతాట

అలీ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఎన్ఆర్ డెవలపర్స్‌కు చెందిన ముప్పాళ్ల వెంకటనర్సయ్య నిర్మాణాలు చేపట్టారు. నీటిపారుదల చట్టం-135ఎఫ్ ప్రకారం ఇది అక్రమం. అందుకే గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేశాం. రెవెన్యూ శాఖకూ లేఖ రాశాం. కానీ ఎవరూ స్పందించటం లేదు. – సురేఖ, నీటిపారుదల శాఖ డీఈఈ

నీటిపారుదలశాఖ ఎఫ్‌టీఎల్ నిర్ధారణపై ఎన్ఆర్ డెవలపర్స్ కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలని చెప్పింది. నీటిపారుదలశాఖ ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తే తదుపరి మేం చర్యలు తీసుకుంటాం. – అనంతరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో

ఎన్ఆర్ డెవలపర్స్‌పై గతంలో నీటిపారుదలశాఖ ఫిర్యాదు చేసిన మాట వాస్తవమే. అప్పుడు ఎఫ్ఐఆర్ నమోదుచేశాం. కానీ కూల్చివేతలకు సంబంధించి రెవెన్యూశాఖ మాకు లేఖ రాయాలి. అప్పుడే మేం కూల్చివే తల సమ యంలో బలగాలను పంపి, రక్షణ కల్పిస్తాం. – బబ్యనాయక్, మంచాల ఇన్‌స్పెక్టర్

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ)/ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా మంచాల మండలం కాగజ్‌ఘట్ పరిధిలోని 25 ఎకరాల అలీ చెరువు ఆక్రమణల తొలగింపుపై ప్రభుత్వ శాఖలు చెప్తున్న సాకులు ఇవీ. కండ్ల ముందు ఎన్ఆర్ డెవలపర్స్ ఏకంగా చెరువును సగానికి పైగా ఆక్రమించి.. రిసార్ట్‌తో పాటు పెద్దఎత్తున విల్లాలను నిర్మిస్తున్నా ప్రభుత్వ శాఖలు తలో మాట చెప్తూ హైడ్రామా సృష్టిస్తున్నాయి. వాస్తవానికి అలీ చెరువు ఆక్రమణలపై ఈ ఏడాది ఏప్రిల్ 24న పోలీసులకు నీటిపారుదల శాఖ ఫిర్యాదు చేసింది. ఏఈఈ ఆర్ శారద మంచాల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో.. 'చెరువు పరిధిలో ఎన్ఆర్ డెవలపర్స్‌కు చెందిన ముప్పాళ్ల వెంకటనర్సయ్య అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. తగిన చర్యలు తీసుకోండి' అని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ మేరకు ఎఫ్ఐఆర్ (నెంబరు 110/2024) నమోదైంది. కానీ ఇప్పటివరకు అటువైపు యంత్రాంగం కన్నెత్తి చూడలేదు. చెరువు ఆక్రమణను అన్ని శాఖలు నిర్ధారిస్తున్నా కూల్చివేతలకు ఉపక్రమించక పోవటం రేవంత్ సర్కారు బుల్డోజర్ న్యాయం కొందరికే అనేది అక్షరాలా రుజువు అవుతున్నట్టు స్పష్టమవుతున్నది. బీహార్ అసెంబ్లీ బలపరీక్ష సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇక్కడే క్యాంపు నిర్వహించడం, సీఎం రేవంత్‌రెడ్డి అక్కడికి వచ్చేందుకు అధికారులు ప్రభుత్వ నిధులతో రోడ్లు వేయడమంటే అలీ చెరువు ఆక్రమణ అనేది ప్రభుత్వ, అధికార యంత్రాంగం కనుసన్నల్లో జరిగిందనేది తేటతెల్లమవుతున్నది.

రియల్ సంస్థకే అధికారుల వత్తాసు

హైదరాబాద్‌లో యజమానులకు నోటీసులు కూడా ఇవ్వకుండా హైడ్రా, ఇతర శాఖలు నిర్మాణాలను కూల్చివేస్తుండగా.. అలీ చెరువు విషయంలో మాత్రం అధికార యంత్రాంగం ఎన్ఆర్ డెవలపర్స్‌కు వత్తాసు పలికే రీతిలో వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తున్నది. హెచ్ఎండీఏ పరిధిలోని లేక్ ప్రొటెక్షన్ కమిటీ అలీ చెరువుతో పాటు 1500-1600 చెరువుల ఎఫ్‌టీఎల్‌ను శాస్త్రీయంగా గుర్తించి, మ్యాప్‌లు, సర్వే నంబర్లతో సహా అధికారిక వెబ్‌సైట్‌లో ప్రజలందరికీ అందుబాటులో ఉంచింది. ఇప్పుడు హైడ్రా కూడా దీనినే ప్రామాణికంగా తీసుకొన్నది. ఇందులో భాగంగానే ఖానామెట్‌లో సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేసింది. కానీ అలీ చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణను ఎన్ఆర్ డెవలపర్స్ ప్రశ్నిస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కోర్టు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలని చెప్పింది తప్ప అక్రమ నిర్మాణాలపై స్టే ఇవ్వలేదు. దీంతో నీటిపారుదల శాఖ మరోసారి అధికారికంగా ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించే ప్రక్రియ నిర్వహిస్తే సరిపోతుంది. కానీ నీటిపారుదల శాఖ ఆ పనిచేయదు. రెవెన్యూ శాఖ సైతం మరోసారి ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలంటూ బంతిని నీటిపారుదలశాఖ కోర్టులోకి నెడుతున్నది. కూల్చివేతలకు రెవెన్యూ శాఖ నుంచి లేఖ రావాలని పోలీస్‌శాఖ భీష్మించుకొని కూర్చున్నది. ఇలా ఎవరికి వారు బంతిని పక్కకు నెడుతూ అలీ చెరువు ఆక్రమణలపై ఈగ వాలనివ్వటం లేదనేది స్థానికుల ఆవేదన.

ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లోని మున్నేరు వరద బాధితులను ఆదుకునేందుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పంపించిన నిత్యావసర సరుకుల వాహనాలను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర జెండా ఊపి ప్రారంభించారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు కడుపు సల్లంగుండ

బానోతు రాత్రే, తీర్థాల, ఖమ్మంరూరల్ మండలం, ఖమ్మం జిల్లా

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 6 : మాజీ మంత్రి హరీశ్‌రావు సేవా నిరతి పట్ల యావత్ ఖమ్మంజిల్లా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వరదలు వచ్చిన మరుసటి రోజే హుటాహుటిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, ఎంపీలు కదలి వచ్చి ధైర్యం చెప్పిన తీరుపట్ల ఖమ్మంరూరల్ వరద బాధితులు ఇప్పటికీ చర్చించుకుంటున్నారు. 'ఓపెన్‌టాప్ జీప్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అలా వచ్చి ఇలా వెళ్లిపోయాడని, అదే హరీశ్‌రావు బురదమట్టి, ఒండుమట్టి అని చూడకుండా ఇండ్లల్లోకి వచ్చి జరిగిన తీరు తెలుసుకోవడం, ప్రభుత్వంతో కొట్లాడి న్యాయం జరిగే వరకు మీ వెంట ఉంటామని పది మంది ముందు చెప్పిన మాటలను నేటికీ ముంపు బాధితులు గుర్తు చేసుకుంటున్నారు. హరీశ్‌రావు తక్షణమే స్పందించి ఆరు లారీల్లో వరద బాధితులకు సరుకులు ఖమ్మం పంపడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ధైర్యం చెప్పిండు.. సరుకులు పంపిండు

వరదలు వచ్చిన తెల్లారే హరీశ్‌రావు సార్ మా మండలంలో పర్యటించారు. తెల్లారేసరికి వచ్చి అందరని మందలించిండు. మీకు న్యాయం జరిగే వరకు కొట్లాడుతానని చెప్పాడు. ఇయ్యాల అన్నట్లుగానే మా కోసం సరుకులు పంపిండు. ఇంటికి వచ్చి బియ్యం సంచి, నూనె, పప్పులు, బ్రెడ్డు, చాలా రకాల వస్తువులు ఇచ్చిండ్రు. సంచిమీద బొమ్మను చూశాను. మా ఇబ్బంది చూసి ఎక్కడో ఉన్న ఆ కొడుకు సాయం చేసిండు. చిన్నగోడల తాటాకు ఇల్లు వరదకు కూలిపోయింది. సర్కార్ వచ్చి మందలించిన పాపాన పోలేదు. హరీశ్‌రావు సార్ సాయం మర్చిపోం.

– బానోతు మోతి, తీర్థాల, ఖమ్మంరూరల్ మండలం, ఖమ్మం జిల్లా

సరుకులు పంపిన సార్‌కు రుణపడి ఉంటాం..

మేము ఎలా ఉన్నామో తెలుసుకొని మా పేరుతో సరుకులు పంపిన హరీశ్‌రావు సార్‌కు రణపడి ఉంటాం. బీఆర్ఎస్ నాయకులు బెల్లం వేణు, ఇతర నాయకులు ఇంటిదాక వచ్చి నాకు సరుకులు ఇచ్చి పోయిండ్రు. కొద్దిగా వరద పెరిగితే ఊరికి ఊరు కొట్టుకపోయేది. అటు ఆకేరు వాగు, ఇటు మున్నేరు వాగు ఎప్పుడు ఊరుమీద పడతదో అని భయం భయంగా బతికాం. ఇప్పుడు మా బతుకు ఎటూ కాకుండా పోయింది. ఇంట్లో వస్తువులు ఆగమయ్యాయి. పొలాల్లో పంటలు పోయాయి. ఈ ఏడాది బతుకు ఎట్టా ఉంటదో తెలవడం లేదు. కానీ ఈ మాత్రం సరుకులు పంపిన బీఆర్ఎస్ పార్టీ వాళ్లకు కృతజ్ఞతలు.

– బానోతు టాత్రే, తీర్థాల, ఖమ్మంరూరల్ మండలం, ఖమ్మం జిల్లా

సీఎం సహాయ నిధికి ప్రముఖుల విరాళాలు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు రూ.2.5 కోట్లను అందజేస్తున్న జీఎంఆర్ గ్రూపు ప్రతినిధులు

దాతలు	విరాళం
జీఎంఆర్ గ్రూపు	రూ.2.50 కోట్లు
టీజీఎఫ్‌డీసీ	రూ.2 కోట్లు
ఆర్‌బీఆర్ ప్రాజెక్ట్	రూ.కోటి
కెమిలాయిడ్స్ కంపెనీ	రూ.కోటి
శ్రీచైతన్య విద్యాసంస్థలు	రూ.కోటి
విర్కో ఫార్మా	రూ. కోటి
అపోలో హాస్పిటల్	రూ. కోటి
వెన్నవరం భూపాల్‌రెడ్డి	రూ. 2 లక్షలు

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : వరద బాధితులను ఆదుకోవడం కోసం సీఎంసహాయ నిధికి పలువురు ప్రముఖులు విరాళాలు అందజేశారు. సచివాయంలో సీఎం రేవంత్‌రెడ్డిని పలు కంపెనీలకు చెందిన ప్రముఖులు శుక్రవారం కలిసి విరాళాలు అందజేశారు. జీఎంఆర్ గ్రూపు రూ.2.50 కోట్ల చెక్కును అందజేశారు. కెమిలాయిడ్స్ కంపెనీ చైర్మన్ రంగరాజు, శ్రీచైతన్య విద్యాసంస్థలు, విర్కోఫార్మా, అపోలో హాస్పిటల్ జేఎండీ సంగీతారెడ్డి, ఆర్‌బీఆర్ ప్రాజెక్ట్ ఎండీ రాయల రఘు రూ. కోటి చొప్పున విరాళం అందజేశారు. ప్రొటెం మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి రూ. 2 లక్షల విరాళం అందజేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డికి ఈ చెక్కులు ఇచ్చారు. రూ.లక్ష తెలంగాణకు, రూ. లక్ష ఆంధ్రప్రదేశ్‌కు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ కోఆర్డినేటర్ కృష్ణకాంత్, మైనార్టీ నాయకులు అజీముద్దీన్, గౌస్, విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్, పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కాళ్లు పట్టుకున్న రైతు

- వరదల పరిస్థితిపై రైతుల భావోద్వేగం
- ఆదుకుంటామన్న కేంద్రమంత్రులు
- నష్టం 5,438 కోట్లు: సీఎం రేవంత్
- ఖమ్మం జిల్లాలో పర్యటించిన శివరాజ్‌సింగ్, బండి సంజయ్

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కాళ్లు మొక్కుతున్న రైతు నర్సింహారావు

ఖమ్మం/కూసుమంచి, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వర్ష బీభత్సానికి సర్వస్వం కోల్పోయిన తమను ఆదుకోవాలని ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కోక్యా తండాకు చెందిన హలావత్ నర్సింహారావు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కాళ్లు పట్టుకుని ప్రాధేయపడ్డారు. కష్టాల్లో ఉన్న రైతులను అన్నివిధాలుగా ఆదుకోవాలని, రైతులు పుట్టెడు కష్టంలో ఉన్నారని కేంద్రమంత్రికి శోకతప్త హృదయంతో విన్నవించాడు. ఖమ్మం జిల్లాలో జరిగిన అపార వరద నష్టాన్ని శుక్రవారం ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించడానికి వచ్చిన కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, బండి సంజయ్ కూసుమంచి మండలం పాలేరు నవోదయ పాఠశాలలో రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ ఇబ్బందులు చెప్పాలని కేంద్ర మంత్రి కోరగానే కోక్యాతండాకు చెందిన హలావత్ నర్సింహారావు హిందీలో తన గోడును వెల్లబోసుకున్నారు. పంటనష్టం జరిగిన తీరు, తమను బతికించే గేదెలు, వ్యవసాయానికి ఉపకరించే ఎడ్లు, ఆదాయాన్నిచ్చే మేకలు, కోళ్లు, ఇంటి సామగ్రి సర్వస్వం కోల్పోయామని గద్గదస్వరంతో వివరిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. మధ్యప్రదేశ్ సీఎంగా పనిచేసిన చౌహాన్ రైతుల కష్టాలు తెలిసినవారని, తమను ఆదుకోవాలని కోరుతూ హఠాత్తుగా వేదికమీదకు వెళ్లి శివరాజ్‌చౌహాన్ కాళ్లపై పడ్డారు. ఈ సంఘటన అక్కడున్న రైతులు, అధికారులను చలింపచేసింది. నర్సింహారావును గుండెకు హత్తుకుని, అధైర్య పడొద్దని కేంద్రం అండగా ఉంటుందని చౌహాన్ భరోసా ఇచ్చారు.

నష్టాన్ని చూశాం.. ఆదుకుంటాం

వరదల్లో నష్టపోయిన రైతులు, బాధితులు ఆందోళన చెందవద్దని, నష్టాన్ని కళ్లారా చూశామని, అందరినీ తప్పకుండా ఆదుకుంటామని కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, బండి సంజయ్ భరోసానిచ్చారు. ఖమ్మం జిల్లాలో వర్షం సృష్టించిన బీభత్సాన్ని కేంద్ర మంత్రులు శుక్రవారం పరిశీలించారు. కూసుమంచి మండలంలోని నానుతండా, నర్సింహులగూడెం, పాలేరు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వారి వెంట ఉండి జిల్లాలో జరిగిన నష్టాన్ని వివరించారు. పాలేరు ప్రధాన కాలువకు పడిన గండిని కేంద్ర మంత్రులు పరిశీలించారు. ఖమ్మం, సూర్యాపేట, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జరిగిన నష్టంపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కూడా కేంద్ర మంత్రులు తిలకించారు.

ఆదుకోండి : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో అపార నష్టం వాటిల్లిందని, తగిన సాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, బండి సంజయ్ శుక్రవారం రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం సచివాలయంలో సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. ఇటీవలి భారీ వర్షాలతో వాటిల్లిన వరద నష్టం తీవ్రతను సీఎం వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం వరద నష్టం రూ.5,438 కోట్లు అని చెప్పారు. వరద ప్రభావిత జిల్లాల్లోని గ్రామాల్లో బాధిత కుటుంబాలు కోలుకోలేని విధంగా నష్టపోయారని, ఇప్పటికీ ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. తీవ్ర పంట నష్టం జరిగిందని, పొలాలన్నీ రాళ్లు, ఇసుక మేటలతో నిండిపోయాయని అధికారులు వివరించారు.

నిబంధనలు సడలించండి

రాష్ట్రాలు వంద శాతం ఎన్డీఆర్ఎఫ్ నిధులు వినియోగిస్తేనే, శాశ్వత మరమ్మతు పనులకు ఎన్డీఆర్ఎఫ్ నిధులు వాడుకోవాలనే నిబంధనను సడలించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. రెండు తెలుగు రాష్ట్రాలలో జరిగిన వరద నష్టాన్ని ఒకే తీరుగా చూడాలని, ఏపీ మాదిరిగానే తెలంగాణకూ కేంద్రం సాయం అందించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని కేంద్రవ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. కనీస మద్దతు ధర రూ.15వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అదేవిధంగా తెలంగాణకు కొబ్బరితోటలకు సంబంధించి ఒక రీజినల్ సెంటర్ ఏర్పాటు, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ట్రైబల్ వెల్ఫేర్ ఆర్గానిక్ ఫార్మింగ్‌ను-అశ్వారావుపేట(ట్రైబల్, నాన్ ట్రైబల్ శిక్షణ)ను ఏర్పాటు చేయాలని అన్నారు. వీటిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్టు తుమ్మల పేర్కొన్నారు.

- కరెంటు కోసం ధర్నా

డబుల్ బెడ్‌రూం ఇండ్లకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ జగిత్యాల జిల్లా కేంద్రం శివారులోని నూకపెల్లి డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ బీ సత్యప్రసాద్ శుక్రవారం పర్యటించగా..అక్కడ నివసించే కుటుంబాలు మెయిన్ వైర్ల నుంచి విద్యుత్‌ను డైరెక్టుగా వాడుకోవడం చూసి సంబంధిత అధికారులతో మాట్లాడారు. పర్యటన అనంతరం అధికారులు కాలనీకి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొన్న లబ్ధిదారులు నిరసన తెలపడంతో సాయంత్రం 4 తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. – జగిత్యాల

ఆరు రోజులైనా బురదలోనే..

- ఖమ్మం వరద బాధితులకు అందని సాయం సర్వేల పేరుతో అధికారుల కాలయాపన
- బ్లీచింగ్ చల్లేవారు కరువయ్యారని స్థానికుల ఆవేదన

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 6 : ఖమ్మం రూరల్ మండలంలో వరద ఉధృతి తగ్గి ఆరు రోజులైనా సాయం కోసం బాధితులు ఎదురుచూస్తూనే ఉన్నారు. అధికారులు వచ్చి సర్వే చేస్తున్నారే తప్ప ప్రభుత్వం నుంచి ఏ మాత్రం సాయం అందకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఆకేరువాగు సమీపంలోని వాల్యతండా కస్నాతండా, పిట్టలవారిగూడెం, తనగంపాడు గ్రామాలు వరద తాకిడికి చిన్నాభిన్నమయ్యాయి. వీటితో పాటు తీర్థాల, పోలెపల్లి, పెద్దతండా, గుడిమళ్ల తదితర గ్రామాల పరిధిలోని కాలనీలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పెద్దతండా పరిధిలోని రాజీవ్ గృహకల్ప, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, జలగం నగర్, నాయుడుపేట తదితర కాలనీల్లో రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. ఇళ్లల్లోని సామగ్రి, బియ్యం, దుస్తులు, పుస్తకాలన్నీ నీటిపాలయ్యాయి. ఇళ్ల నిండా బురద పేరుకుపోయింది. ఇంత జరిగినా ప్రభుత్వం అందించే చిరు సాయం కొద్ది ప్రాంతాలకే పరిమితమవుతుందని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇందిరమ్మ కాలనీ సగానికి సగం మునిగినా ఇంతవరకు పంచాయతీ కార్యదర్శి స్థాయి ఉద్యోగి కూడా తమ వైపు రాలేదని బాధితులు వాపోతున్నారు. మురుగు కంపు కొడుతున్నా కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లే నాథుడు కూడా కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయుడుపేటలోని అనేక కాలనీల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొన్నది. మూడు రోజుల నుంచి అధికారులు, సిబ్బంది సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారనే తప్ప పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

- పొలాల్లో రాళ్లు, ఇసుక మేట

మహబూబ్‌బాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామ పెద్ద చెరువు కట్ట తెగడంతో దిగువన ఉన్న పొలాల్లో ఇలా రాళ్లు, ఇసుక మేట వేసింది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

- మున్నేరు వంతెన పైనుంచి రాకపోకలు బంద్

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్ మున్నేరు వంతెన స్వల్పంగా కదిలిన నేపథ్యంలో రాకపోకలు నిలిపివేశారు. శుక్రవారం వంతెనకు ఇరువైపులా గోడ నిర్మించారు. వంతెన స్పాన్ బేరింగ్ పైనుంచి పక్కకు జరిగిందని ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు తెలిపారు. భారీ వాహనాలు నగరంలోకి కాల్వొడ్డు పాత వంతెన మీద నుంచి అనుమతి లేదని, బైపాస్ రో